క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



జగపతినగరంలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

కిర్లంపూడి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి గ్రామాల్లో భక్తులు తెల్ల వారుజామున పుణ్యస్నానాలు ఆచరించి నూనెతో వెలిగించిన జ్యోతిని చేతబట్టి పురవీధుల్లో భజనలు చేసుకుంటూ తిరిగారు. భక్తి గీతాలు ఆలపించారు. కార్తికమాసం పూర్తయ్యే వరకూ గ్రామాల్లో నగర సంకీర్తనలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ లక్ష్మణరావు

కిర్లంపూడి: జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్. లక్ష్మణరావు ఆదివారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌ను తొలిసారిగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకూ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని ఎస్సై పి.ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు ఎక్కండి.. బహుమతి పొందండి

తుని: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో పరిధిలోని తుని-నర్సీపట్నం, కోటనందూరు-కాకినాడ రూట్లలో తిరిగే బస్సుల్లో గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టనట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ప్రయాణం పూర్తయిన తరువాత ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్ నంబరును రాసి గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒక్కసారి లక్కీ డ్రా తీసి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ కిరణ్‌కుమార్ కోరారు.

వన భోజనాల సందడి

- ఉత్సాహంగా కార్తిక వనసమారాధనలు
- ఆటపాటలతో సందడి చేసిన పిల్లలు, పెద్దలు



ధర్మవరం వనసమారాధనలో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



జగ్గంపేటలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ప్రత్తిపాడు రూరల్: కార్తిక వనసమారాధనలతో మానవ సంబంధాలు బలపడతాయని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ సమీపంలోని మామిడి తోటలో ఆదివారం ప్రత్తిపాడు వర్తక సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ముఖ్య అతిథులుగా హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. వర్తక సంఘం సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ముందుగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ధారపల్లి, ఎరకంపాలెం, తోటపల్లి జలపాతాల వద్ద వివిధ ప్రాంతాలను వచ్చిన యాత్రికులు పుణ్యస్నానాలు ఆచరించి అక్కడే వనభోజనాలు చేశారు.

జగ్గంపేట: కార్తిక మాసంలో నిర్వహించే వనభోజనాలు ఐక్యతకు పతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట శివారు గుర్రంపాలెం రోడ్డులో తూర్పుకాపులు ఏర్పాటు చేసిన కార్తిక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పు కాపుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. తూర్పుకాపులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, వైఎస్సార్ సీపీ నేతలు కంచి లక్ష్మణదొర, బొదిరెడ్డి చక్రరావు, తూర్పుకాపు సంఘం నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధనలు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం కార్తిక వనసమారాధనలు వైభవంగా జరిగాయి. ఏలేశ్వరం పట్టణానికి చెందిన విజయభార్గవి జ్యూయలర్స్ ఆధ్వర్యంలో స్థానిక దిబ్బలపాలెంలోని నడిమింటి నూకరాజు పొలంలో సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. పట్టణంలోని పలుప్రాంతాల నుంచి మహిళలు, పిల్లలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. నిర్వాహకులు రౌతు సుబ్బారావు సన్స్, మెలిపాక నాగేంద్ర, నడిమింటి కృష్ణ బ్రదర్స్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మండలంలోని సిరిపురంలో అనపర్తి రాంబాబు, రాధ దంపతుల ఆర్థిక సహాయంతో సుమారు 3,500 మందికి వనసమారాధన ఏర్పాటు చేశారు. సిరిపురంతో పాటు ఏలూరు, చిన్నింపేట నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత రాంబాబు దంపతులు ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.



సిరిపురంలో ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తున్న రాంబాబు దంపతులు

ప్రజలందరికీ రక్షిత తాగునీరు



జి.కొత్తపల్లిలో కుళాయి ఏర్పాటుకు గొయ్యి తవ్వుతున్న కార్మికులు

శంఖవరం: ప్రజలందరికీ రక్షితతాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈగల విజయదుర్గ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు కనెక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

స్ఫూర్తిప్రదాత ఝాన్సీ లక్ష్మీబాయి

జగ్గంపేట: బాలికలు, మహిళలు ఝాన్సీ లక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక బాలికల హాస్టల్ ఆదివారం ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం బాలికలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సాయి సూర్యలక్ష్మి, మణికర్ణిక, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చీడికమ్మతల్లి జాతరోత్సవాలకు సర్వం సిద్ధం

- నేడు, రేపు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



కేఓ.మల్లవరం గ్రామ దేవత చీడికమ్మతల్లి

తుని రూరల్: మండలంలో కేఓ మల్లవరం గ్రామదేవత చీడికమ్మతల్లి జాతర మహోత్సవాలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆశీస్సులతో గ్రామ సర్పంచ్ డొంక సత్యవతి, గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమ, మంగళవారం ఉత్సవాలు జరగనున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం కేరళ డప్పు వాయిద్యాల నడుమ బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పిస్తారు. వేంకటేశ్వర నాట్య మండలి వారితో కన్నీటి భారతం సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తారు. సాయంత్రం ఆరు గంటల నుంచి తెల్లవార్లు జాగరణ నిర్వహించనున్నారు. 21న ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారిని భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రికి విశాఖపట్నం వారితో బుర్రకథ, హైదరాబాద్, గుంటూరు, రాజమహేంద్రవరం వారితో సినీ డూప్ డ్యాన్స్, జబర్దస్, ఢీ కళాకారులతో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, శ్రీకృష్ణ కళాకారులతో తోలుబొమ్మలాట, కూచిపూడి, జానపద, కోలాటం నృత్య ప్రదర్శనలు, మిరమిట్లు గొలుపే విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సర్పంచ్, ఎంపీటీసీల మృతికి సంతాపం

రౌతులపూడి: మండలంలోని బలరాంపురం సర్పంచ్ దాసరి తాతాజీ, గిడజాం ఎంపీటీసీ సభ్యురాలు విజ్జపు సూర్యకళ ఇటీవల మృతి చేందారు. కాగా ఆదివారం మండల కాపు నాయకులు వారి మృతికి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల కాపు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

నేడు లోవకొత్తూరులో మంత్రి రాజా పర్యటన

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరులో సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని ఎస్సీ సెల్ నాయకుడు లంక కృపానందం ఆదివారం తెలిపారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఉదయం 10.30 గంటలకు మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభిస్తారన్నారు. అనంతరంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన చాకలి తిప్పడు వీధి నాటకం



చాకలి తిప్పడు వీధి నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కళాకారులు చాకలి తిప్పడు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలో నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. నాటకంలో తిప్పడుగా మొరుకుర్తి శ్రీను, భార్యగా కోనేటి సత్తిబాబు, కొడుకుగా నానిపల్లి వెంకన్న, కూతురుగా రాచపల్లి సత్తిబాబు, పక్కుర్తి పుష్ప నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్-డ్రెసింగ్ చేశారు. తొలుత గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. గౌరీ శంకరుల ఉత్సవాల్లో భాగంగా ఏటా ధర్మవరంలో వీధి నాటకాలు ప్రదర్శించడం ఆనవాయితీ.

జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయండి

- విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



జెడ్.రాగంపేట ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే దృఢ సంకల్పంతో వియజనగరం జిల్లా నుంచి తిరుమలకు ఆయన చేస్తున్న పాదయాత్ర ఆదివారం మండలంలోని నీలాద్రిరావుపేట మీదుగా జెడ్ రాగంపేటకు చేరుకుంది. ఆయనకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తన అనుచరులతో ఘన స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్సీ రఘురాజు కోరారు. డిసెంబర్ 21న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆ రోజుకు పాదయాత్ర తిరుమలకు చేరుకుంటుందని రఘురాజు తెలిపారు. ప్రతి రోజూ సుమారు 22 కిలోమీటర్లు నడుస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ విజయనగరం నుంచి తిరుపతికి పాదయాత్ర చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ గండేపల్లి మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, సర్పంచులు ములంపాక సురేష్, కందుల చిట్టిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ బండారు రాజా, పార్టీ నాయకులు సూతి శ్రీను, జ్యోతుల ఎర్రబాబు, అప్పారావు కాపు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎ.కొత్తపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ ఆదివారం తెలిపారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డి.సువర్ణలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు జగన్నాథపురంలో..

కోటనందూరు: మండలంలోని జగనాథపురంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం



ఏలేశ్వరంలో జెండాను ఆవిష్కరించి సహకార వారోత్సవాలను ప్రారంభిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం సహకార వారోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయం వద్ద రాష్ట్ర సహకార సంఘ యూనియన్ డిప్యూటీ రిజిస్ట్రార్ విక్రృష్ణకాంత్ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సహకార సంఘాలు కృషి చేస్తున్నాయన్నారు. సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ అధికారి జీఎస్‌వీ ప్రసాద్, చైర్మన్ కొండపల్లి వెంకటేశ్వరరావు, సభ్యులు సిరిపరపు రాజేష్, దాసరి రమేష్, సీఈఓ జ్యోతుల శ్రీనివాస్, ఆలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలి



గుర్రంపాలెంలో నిరసన ప్రదర్శన చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో గత 20 సంవత్సరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు గుర్రంపాలెంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా గ్రామానికి చెందిన దళితులు, నిరుపేదలు తుప్పలు డొంకలు తొలగించి సీలింగ్ భూమిని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూములకు పట్టాలు పంపిణీ చేయాలని ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఎవరూ స్పందించక పోవడంతో సోమవారం చలో కలక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు కూలీ సంఘ నాయకులు డి.సురేష్, బ్రహ్మం, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



వెండి కలశాలలో పంచామృతాలకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు



ప్రత్తిపాడు శ్రీషిర్డిసాయి ఆలయంలో లక్ష బిల్వార్చన

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో 108 వెండి కలశాల్లో పంచామృతాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి అమ్మవార్లకు అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉమాపార్థివేశ్వరస్వామికి విశేష పూజలు

ప్రత్తిపాడు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు తోటవీధిలోని షిర్డీసాయి ఆలయంలో ఉమాపార్థివేశ్వరస్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిలకమర్తి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో రుత్విక్కులు తొలుత విఘ్నేశ్వర పూజ, స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రికి అత్యంత భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

రౌతులపూడి: మండలంలోని గిడజాం గ్రామంలో మహిళ అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన విజ్జపు సూర్యకళ (23) (టీడీపీ ఎంపీటీసీ) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందన్నారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారన్నారు. ఆమె మృతికి పలువురు విచారం వ్యక్తం చేశారు. మృతురాలి సోదరుడు ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి



ప్రత్తిపాడులో ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రత్తిపాడు: దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరాగాంధీ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ధరణాల కోట శ్రీను, రాష్ట్ర ఎస్సీ సెల్ మహిళా కో ఆర్డినేటర్ తేజోమూర్తుల ఉషారాణి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాషరావు, పార్టీ నాయకులు కొప్పన కోటేశ్వరరావు, పోతాబత్తుల పెదబాబు, కె శామ్యూల్, స్థానిక క్వారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఈరుగుల చక్రం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళులు

ఏలేశ్వరం: మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు తదితరులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉడతల రమణారావు, పుల్లయ్య, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తిక శోభ

- సోమవారం పూజలకు ముస్తాబైన శివాలయాలు
- రూ.25 లక్షలతో గోకవరం ఆలయం ఆధునీకరణ
- కొత్తపల్లిలో 300 ఏళ్ల చరిత్ర కలిగిన రెడ్డిరాజుల కాలంనాటి శివాలయం



గోకవరంలో అభివృద్ధి చేసిన రామలింగేశ్వర స్వామి ఆలయం

గోకవరం: ఆలయాలు కార్తిక శోభను సంతరించుకున్నాయి. కార్తిక మాసంలో మొదటి సోమవారం పూజలకు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. మండలంలో స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, ఉమాగోకర్ణేశ్వరస్వామి, కొత్తపల్లి సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన రెడ్డిరాజుల కాలం నాటి రాజలింగేశ్వరస్వామి ఆలయం, తంటికొండలో అఖిలాండేశ్వరి సమేత జంబుకేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధిగాంచినవి.

శివాలయం అభివృద్ధి

గోకవరం ప్రధానరహదారికి ఆనుకుని ఉన్న పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి సైతం సుమారు వందల సంవత్సరాలకు పైబడి చరిత్ర ఉంది. ఆలయం తూర్పు ముఖంగా కోనేరు ఉంది. ఏటా కార్తికమాసంలో మహిళలు ఈ కోనేటిలో దీపాలు వదులుతారు. కాగా ఈ ఆలయాన్ని ఇటీవల రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు. ఆలయ మండపాన్ని, ధ్వజస్తంభాన్ని పునర్నిర్మించారు. కోనేటిని అభివృద్ధి చేశారు. రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామికి సుమారు 200 వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఆలయంలో కొలువైన గోకర్ణేశ్వరస్వామి పేరుమీదే గ్రామానికి గోకవరం అనే పేరు వచ్చిందని భక్తుల నమ్మకం.

ముస్తాబైన రాజలింగేశ్వరస్వామి ఆలయం

కొత్తపల్లిలో సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయం ఉంది. రెడ్డిరాజుల కాలంలో ఈ శివాలయాన్ని నిర్మించినట్టు చరిత్ర ఆధారాలు ఉన్నాయి. ఇక్కడ స్వామి వారు బాలాత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వరస్వామిగా భక్తులకు దర్శనమిస్తారు. ఆలయానికి విశేష చరిత్ర ఉండటంతో ఎండోమెంట్ శాఖ అధికారులు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లోని శివాలయాల వద్ద పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శైవ క్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

తొండంగి: కార్తిక మాసంలో మొదటి సోమవారం పూజలకు మండలంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. గోపాలపట్నం ఉమారామలింగేశ్వర స్వామి, తొండంగి రామలింగేశ్వరస్వామి, ఒంటిమామిడి, అద్దరిపేట, పంపాదిపేట, పీఈ చిన్నాయపాలెం, పైడికొండ శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.